

ప్రదర్శనలో సందర్శకులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

బంజారాహిల్స్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి.. మరోవైపు పండుగల సీజన్.. షాపింగ్‌ప్రియులు తమకు కావాల్సిన వస్తువులను అన్ని చోట్లా తిరిగి కొనుగోలు చేయాలంటే ఇబ్బందికర పరిస్థితి. ఈ నేపథ్యంలో అన్నిరకాల ఉత్పత్తులను ఒకే గొడుగు కిందకు తెచ్చింది. మాదాపూర్ శిల్పకళా వేదికలో సిల్క్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితమని, ఈ నెల 28 వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మహీంద్ర అశ్వితలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్22 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని హఫీజ్‌పేట రోడ్డులో గల మహీంద్ర అశ్విత లైఫ్ స్పేసెస్‌లో ఆదివారం మహీంద్ర అశ్విత మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశ్రాంత మిలిటరీ ఇంటలిజెన్స్ ఆఫీసర్ ఎం.వంగపతిరావు ప్రారంభించారు. మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, మహీంద్ర అశ్విత లైఫ్ స్పేసెస్ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందితో పాటు కార్యాలయ నిర్వహణ ఉద్యోగులు, వృద్ధులు, ఇంటి పని చేసేవారు దాదాపు వందమందికి పైగా ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. యువ సామాజిక కార్యకర్త పీ.వెంకట్ నిర్వహణలో జరిగిన శిబిరంలో మాక్సివిజన్ ఆస్పత్రి సిబ్బంది, మేనేజర్ మహేందర్, కౌన్సిలర్ శ్రీలేఖ, ఆప్టోమెట్రిస్ట్ హిమబిందు, కోఆర్డినేటర్ విజయ్ పాల్గొనగా.. అశ్విత సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛంద సేవతో నిర్వహించారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



మాట్లాడుతున్న రవియాదవ్

పార్టీ మారిన వారికి గుణపాఠం చెబుదాం

గచ్చిబౌలి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రవియాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాలు పార్టీలో ఉండి అన్ని పదవులు అనుభవించి, అధికారం మారగానే కాంగ్రెస్‌లో చేరడటం సిగ్గుచేటన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులకు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, రాములు, రమాదేవి, లింగం శ్రీను, మల్లేశ్‌గౌడ్, శ్రీకాంత్, పవన్, కొండల్‌రెడ్డి, గడ్డం శ్రీను, చిరంజీవి అంజయ్య, నర్సింహ పాల్గొన్నారు.



మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో మాట్లాడుతున్న బండి రమేష్

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ముస్లిం యూత్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి అన్నసమారాధన ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ మగ్దూం, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఎల్.రాజా, గంధం రాజు, యూనుష్, అన్వర్, రియాజ్, ఎస్కే సత్తార్, ఎస్కే ఖుద్దూష్, ప్రవీణ్‌కుమార్, అరవింద్‌రెడ్డి, దొడ్డి రంగస్వామి, బుట్టో రాంబాబు నాయుడు, కొల్లా శంకర్, కట్టా నరసింగరావు పాల్గొన్నారు.

వాడీవేడిగా ఎంఐజీకాలనీ సర్వసభ్య సమావేశం

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పాఠశాల నిధుల దుర్వినియోగం, ఏకపక్ష నిర్ణయాలు, కాలనీ మిగులు స్థలాల పరిరక్షణ తదితర ప్రధాన అంశాలపై సభ్యుల వాదోపవాదాలు.. సూచనల నడుమ ఆదివారం భెల్ ఎంఐజీ కాలనీ ఫేజ్-1 సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. కాలనీలోని వాణీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా సొసైటీ కమిటీ పర్యవేక్షణలో నడుస్తున్న పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, జీతభత్యాలు తదితర అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలపై తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. పాఠశాల మొదటి అంతస్తుపై అదనపు గదుల నిర్మాణం చేపట్టాని అధ్యక్షుడు వెంకట్రావు ప్రతిపాదించగా, భవన సామర్థ్యాని పరీక్షించి, నిర్ణయం తీసుకోవాలని సభ్యులు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్‌పై సభ్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ తొలగించాలని పట్టుపట్టడంతో మేనేజింగ్ కమిటీ కమిటీ అందుకు తీర్మానించింది. మిగులు స్థలాల విక్రయం, బీఎస్ఎన్‌ఎల్‌కు కేటాయించిన అద్దె, నూతన సభ్యత్వ నమోదు, ఎంఎస్‌ఆర్‌కు కేటాయించిన స్థలం, బ్రిడ్జి నిర్మాణ విషయంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు తదితర అంశాలపై చర్చించారు.కాలనీలో పారిశుధ్య నిర్వహణపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళదామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని కోరుతూ పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి సుబ్బారావు, సి.రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ముందు చెత్తకుప్పలు

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకునే పాఠశాల ముందు ప్రజలు చెత్తను వెయ్యడంతో చెత్త గుట్టలుగా పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. సూరారం డివిజన్ నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల ముందు స్థానిక బస్తీవాసులు రోజూ చెత్త వేస్తున్నారు. ఈ చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బంది నెల రోజులుగా తొలగించడం లేదు. వర్షాలకు చెత్త కుళ్లి, విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త, దుర్వాసన కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాల ముందు పేరుకుపోయిన చెత్త

‘బయోటెక్’ పరేషాన్

- నెలరోజులు దాటినా ప్రారంభం కాని తరగతులు
- ఆలస్యంతో మారనున్న అకడమిక్ క్యాలెండర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఎఫ్ సెట్ కౌన్సెలింగ్ ద్వారా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరిన (ఎంపీసీ స్ట్రీమ్) విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు తమతో పాటు అడ్మిషన్లు పొందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు మొదటి సెమిస్టర్ మొదలై నెలరోజులు దాటిపోగా, బీటెక్ బయోటెక్నాలజీ తరగతులు ఎప్పుడు మొదలవుతాయో తెలియక విద్యార్థులు పరేషాన్ అవుతున్నారు. వాస్తవానికి బీటెక్ కోర్సులన్నింటికీ ఒకే రకమైన అకడమిక్ క్యాలెండర్‌ను రెన్నెళ్ల కిందటే జేఎన్‌టీయూ అధికారులు ప్రకటించారు. ఈ క్యాలెండర్ ప్రకారం ప్రతీ సెమిస్టర్‌లో కనీసం 90 రోజుల పాటు క్లాస్‌వర్క్ జరగాల్సి ఉంటుంది. అయితే, బయోటెక్నాలజీలో చేరిన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులను ప్రారంభించకపోవడంతో దాదాపు నెలరోజుల నుంచి ఆ విద్యార్థులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. తోటి ఇంజనీరింగ్ విద్యార్థులు కళాశాలలకు వెళుతుండగా, తమ పిల్లలకు తరగతులను ఎందుకు ప్రారంభించడం లేదని వర్సిటీ అధికారులను తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

నీట్ కౌన్సెలింగ్ జాప్యంతో ఆగిన ఎఫ్ సెట్ బైపీసీ కౌన్సెలింగ్ దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన నీట్ కౌన్సెలింగ్ పలు కోర్టు కేసుల కారణంగా వాయిదాపడుతోంది. ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు నీట్ ప్రవేశపరీక్షతో పాటు ఎఫ్ సెట్ (బైపీసీ) పరీక్షను కూడా రాశారు. అయితే, నీట్‌లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ పూర్తయితే, మిగిలిన అభ్యర్థులకు ఫార్మసీ, అగ్రికల్చర్, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. నీట్ కౌన్సెలింగ్ ఆలస్యం కావడంతో ఎఫ్ సెట్ (బైపీసీ) స్ట్రీమ్ కౌన్సెలింగ్‌ను ఎప్పుడు చేపడతారనే అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం చెప్పలేని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి బీటెక్ బయోటెక్నాలజీ, బీఫార్మసీ కోర్సుల్లోని మొత్తం సీట్లలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు చెరిసగం ఉంటాయి. (ఉదాహరణకు ఒక సెక్షన్‌లో 60 సీట్లుంటే అందులో 30 ఎంపీసీ, 30 బైపీసీ అభ్యర్థులకు కేటాయిస్తారు.) ఎఫ్ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ గతనెల 19లోపే పూర్తికాగా, ఈ కౌన్సెలింగ్‌లో బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు తాము కూడా కాలేజీల్లో చేరామని, తమకు బీటెక్ బయోటెక్నాలజీ తరగతులను వెంటనే ప్రారంభించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

మారనున్న అకడమిక్ బీటెక్ (బీటీ) క్యాలెండర్!

బీటెక్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు మాదిరిగానే బయోటెక్నాలజీ కోర్సుల నిర్వహణకు ఒకే రకమైన క్యాలెండర్‌ను జేఎన్‌టీయూ అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే బయోటెక్ విద్యార్థులకు నెలరోజులుగా క్లాస్‌వర్క్ జరగకపోవడం, మరో నెలరోజులైనా జరుగుతాయో, లేదో తెలియకపోవడంతో ప్రస్తుతం అమల్లో ఉన్న అకడమిక్ కేలండర్‌ను సవరించాలని పలు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు జేఎన్‌టీయూ అధికారులకు విన్నవిస్తున్నాయి. ఒకవేళ అక్టోబర్ చివరి వారంలో బైపీసీ స్ట్రీమ్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తే- నవంబర్ నుంచి క్లాస్‌వర్క్ మొదలయ్యేలా అకడమిక్ క్యాలెండర్‌ను రివైజ్ చేయాల్సి వస్తుంది. నవంబర్ నుంచి తరగతులు మొదలైతే మండు వేసవిలోనూ క్లాసులు నిర్వహించాల్సి వస్తోంది. వేసవిలో తరగతులంటే అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకులకు అవస్థలు తప్పవని విద్యార్థి సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీలైనంత త్వరగా నీట్, ఎఫ్ సెట్ (బైపీసీ) కౌన్సెలింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలా కాని పక్షంలో బీటెక్ బయోటెక్నాలజీ ఎంపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు, బైపీసీ విద్యార్థులకు వేర్వేరుగా తరగతులు నిర్వహించాలని కోరుతున్నారు. క్లాస్‌వర్క్‌కు అవసరమైనన్ని పనిదినాలు (ఇన్‌స్ట్రక్షనల్ డేస్) సరిపోకుంటే, పని గంటలను (ఇన్‌స్ట్రక్షనల్ అవర్స్) పెంచాలని సూచిస్తున్నారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

మంత్రికి సన్మానం

గచ్చిబౌలి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనిల్‌కుమార్‌యాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు జీహెచ్‌ఎంసీలో ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వ్ చౌహాన్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిల్ కార్యాలయాల్లో డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో ప్రజావాణి నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జోన్, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏ సమస్య ఉన్నా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, ఆస్పత్రి సీఈవో డా.యోబు

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

- బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ డ్యూటీ, కుటుంబ బాధ్యతలతో పాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జోన్ పరిధిలోని ఎనిమిది పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీస్‌లు, వారి కుటుంబసభ్యుల కోసం రాందేవ్‌రావు హాస్పిటల్ సహకారంతో ఆదివారం వార్షిక హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాసరావుతో కలిసి డీసీపీ పర్యవేక్షించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హాస్పిటల్ సీఈవో డా.యోబును సత్కరించారు. సుమారు 200 మంది పరీక్షలు చేయించుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

మెగా వైద్యశిబిరం

మియాపూర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్ పార్కులో హెల్త్‌కేర్ సెంటర్‌లో ఒమెగా హాస్పటల్స్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమక్షంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారికి ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ, 2డి ఎకోతో పాటు మహిళలకు ప్యాప్సిమియర్, మోమోగ్రఫి, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు నిహాలా షరీన్, సాయితేజ, అనుష, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జర్నలిస్టులు

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు: టీయూడబ్ల్యూజే

దుండిగల్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయింపు కోసం యూనియన్ పక్బందీగా పని చేస్తోందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం కుత్బుల్లాపూర్ పరిధిలోని వీఐపీ ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జి.బాలరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కోశాధికారి ఎం వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. గతంలో లేని విధంగా జర్నలిస్టులకు హౌజింగ్ సొసైటీ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం జీఓలు జారీ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి, కోశాధికారి భిక్షపతి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

‘లడ్డూ కల్తీ చేసిన వారిని శిక్షించాలి’

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి లడ్డూను కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త శ్రీనివాస్ కోరారు. దేవుడు లడ్డూలో కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించడంతో శనివారం రాత్రి జీడిమెట్ల డివిజన్‌లో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుమల పవిత్రతను అవినీతి చేసిన రాజకీయ నాయకులకు తగిన రీతిలో శిక్ష విధించాలని, దేవుడి సొమ్మును అప్పనంగా దోచుకున్న టీటీడీ బోర్డు సభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో దేవాలయాలు రాజకీయ పునరావస కేంద్రాలు కాకుండా, ప్రభుత్వ జోక్యాలు లేకుండా, బిల్లు ప్రవేశ పెట్టాలని కోరారు. వేంకటేశ్వర స్వామి భక్తులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతిలో ఖో ఖో పోటీలు

నిజాంపేట్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో హైదరాబాద్ 2024 సీబీఎస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని సీబీఎస్ పాఠశాలల విద్యార్థులకు ఖోఖో పోటీలను నిర్వహించారు. ఆదివారం ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 25 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ జోన్ అదనపు పోలీస్ డిప్యూటీ కమిషనర్ పి.సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ జి.హన్మంతరావు, బంగారు పతక విజేత ప్రమోద్ థోరాట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ- ఆటలు, ఖోఖోను ప్రతీ పాఠశాలలో నిర్వహించాలని, విద్యార్థులు అన్ని ఆటలకు ప్రాధాన్యం ఇస్తే శారీరక దృఢ సంకల్పం, మానసిక ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి, వీఎస్‌ఆర్ విజ్ఞానజ్యోతి ట్రస్ట్ సభ్యులు రాజారామ్మోహన్‌రావు, రాజశేఖర్, డాక్టర్ గీత,రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

‘రామునాయక్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి’

జీడిమెట్ల, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): రామునాయక్‌పై దాడి చేసిన జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చెయ్యాలని మానవ హక్కుల వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 16న ఉదయం జీడిమెట్ల పోలీసులు షాపూర్‌నగర్‌కు చెందిన రామునాయక్‌ను తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన విషయంపై మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ చేసింది. తన మిత్రుడు రూ. 5 వేలు దొంగతనం చేశాడని, వారిని పట్టించి డబ్బులు ఇప్పించవలసిందిగా పోలీసులు తిడుతూ,లాఠీలు, బెల్ట్‌తో కొట్టారని, తన ఎడమ కాలు, చెయ్యి పడిపోయి, పనికి వెళ్లలేక పోతున్నాని బాధితుడు మానవ హక్కుల వేదిక సభ్యుల ముందు వాపోయారు. ఇటీవల ఈ పోలీస్ స్టేషన్‌లో అశోక్ అనేవ్యక్తిని కొట్టడం దీనికి బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను పరిష్కరిస్తా

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీలోని డీపోచంపల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో తాగునీటి సమస్యను పరిష్కారించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులు ఆదివారం జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని అపురూపకాలనీలోని దాదాపు 20 ఇళ్లలో లో, హై ఓల్టేజీ వల్ల గృహోపకరణాలు పాడవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వివరించారు. ఆ ప్రాంతంలో ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు .ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘం సభ్యులు నవీన్, ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు భాస్కర్‌గౌడ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్, లబ్ధిదారులు

ఈత పాఠ్యాంశంలో చేర్చాలని ఈటలకు వినతి

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఈత పాఠ్యాంశంలో చేర్చాలని సామాజిక, ప్రకృతి ప్రేమికుడు కోల రవీంద్రముదిరాజ్, మేడ్చల్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు ఈతలో నైపుణ్యం కల్గి ఉండడం మంచిదన్నారు. ఈత రాక ఎంతో మంది విద్యార్థులు నీటి ప్రమాదంలో మృతవాత పడుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ సంవత్సరం 1 వెయ్యి నుంచి 15 వందల మంది మృతి చెందడం విచారకరం అన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 50 నుంచి 60 వేల మంది విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందుతున్నారని, దీనికి కారణం ఈత రాకపోవడమేనని తెలిపారు. ఈత వచ్చిన విద్యార్థులకు 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు సోషల్, సైన్స్‌లో రెండు మార్కులు అదనంగా కలపాలన్నారు.

ఐకానిక్ బిల్డింగ్ ప్రారంభమెప్పుడో..?

- జేఎన్‌టీయూలో రూ.50 కోట్లతో గోల్డెన్‌జూబ్లీ భవనం నిర్మాణం
- 4 నెలల క్రితం పనులు పూర్తి
- విద్యా సంవత్సరం ప్రారంభమై 3 నెలలైనా నిరుపయోగంగానే..

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్22(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి ఆర్ట్స్ కాలేజీ భవనం మాదిరిగా.. జేఎన్టీయూ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ బిల్డింగ్‌ను నిర్మించారు. యూనివర్సిటీ ఏర్పాటై 50 ఏళ్ల (గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిమిత్తం రూ.50కోట్లతో గతేడాది అప్పటి వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి హయాంలో నిర్మాణ పనులు చేపట్టారు. తన పదవీ కాలంలో పూర్తయ్యే(మే21)లోగా భవనాన్ని ప్రారంభించాలనే కట్టా నర్సింహారడ్డి ఆశ ఎన్నికలకోడ్ ఫలితంగా నెరవేరలేదు. వాస్తవానికి ఈ భవనంలో ప్రతి అంగుళం స్పేస్‌ను ఏయే విభాగాలకు కేటాయించాలో, ఏయే అంతస్తుల్లో ఎటువంటి సదుపాయాలు సమకూర్చాలో పక్కాగా ప్లాన్ చేసిన మాజీ వీసీ కలలు నెరవేరకుండానే ఆయన పదవీకాలం ముగిసింది. అప్పట్నుంచీ ఎంతో విలువైన ఈ భవనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రారంభిస్తారని విద్యార్థులు, ఆచార్యులు ఆశపడినా, రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జ్ వీసీ పట్టించుకోకపోవడంతో వారి ఆశలు నెరవేరలేదు.

● భవనం ప్రణాళిక

ఈ భవనంలోని ఒక్కో అంతస్తులో 17 వేల చదరపు అడుగుల చొప్పున మొత్తం ఎనిమిది అంతస్తుల్లో కలిపి 1.36 లక్షల చదరపు అడుగుల స్థలం సిద్ధంగా ఉంది. ఐకానిక్ భవనాన్ని తొలుత.. ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అవసరాలకు వినియోగించాలని అధికారులు భావించారు. అయితే.. ఇందులోనే ఆదానీ కోనెక్స్ సంస్థ రూ.5 కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు నాడు జేఎన్‌టీయూతో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒక అంతస్తును కేటాయించాలనుకున్నారు. అలాగే, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సౌజన్యంతో బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సును జేఎన్‌టీయూ నిర్వహించాలని భావించింది. ఈ క్రమంలో మరొక అంతస్తును ఇస్రోకు కేటాయించాలని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అంగీకారానికి వచ్చారు. మిగిలిన ఆరు అంతస్తులను ఏవిధంగా వినియోగంలోకి తేవాలనే అంశంపై వర్సిటీ ఉన్నతాధికారులు పెద్ద కసరత్తే చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆయా కోర్సుల నిర్వహణకు, ల్యాబొరేటరీల ఏర్పాటుకు అవసరమైనన్ని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఆచార్యులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం ప్రారంభిస్తే విద్యార్థులకు సదుపాయాలు సమకూరుతాయని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.



జేఎన్‌టీయూ గోల్డెన్ జూబ్లీ బిల్డింగ్

● ఎన్నికల కోడ్ ముగిసి మూన్నెల్లయినా..

గత మే నెలలో రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో జేఎన్‌టీయూలో ఐకానిక్ బిల్డిం గ్ ప్రారంభోత్సవానికి ఎన్నికల సంఘం అనుమతించలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈ భవనాన్ని ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావించారు. అయితే, గత జూలై 13న జేఎన్‌టీయూలో జరిగిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు శిలాఫలకాలను కూడా సిద్ధం చేశారు.

చివరి నిమిషంలో ప్రోటోకాల్ సమస్యలు ఉత్పన్నం కావడంతో రూ.50 కోట్ల విలువైన భవనాన్ని ప్రారంభించకుండానే ముఖ్యమంత్రి వెనుదిరిగారు. దీంతో భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం.. ఆయనకున్న పలు అదనపు బాధ్యతల కారణంగా వర్సిటీ పాలనకు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారని, గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభానికి నోచుకోక పోవడానికి ఇది కూడా ఒక కారణమని విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా భవనాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జేఎన్‌టీయూకు రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఫ్లై ఓవర్ అప్రోచ్‌రోడ్డు

భారీ వాహనాల రాకపోకలతో ప్రాణసంకటం

ఖైల్‌కాలనీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, పాదచారులు, ద్విచక్రవాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నల్లగండ్ల ఫ్లై ఓవర్ అప్రోచ్‌రోడ్ ప్రస్తుతం ప్రమాదభరితంగా మారింది. కనీసం 20 అడుగులు కూడా లేని ఈ రోడ్డుపై భారీవాహనాలు, స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో పాదచారులు, సైకిల్‌పై వెళ్లే వారు భయాందోళనకు గురవుతున్నారు. లింగంపల్లి నుంచి ఎంఐజీకాలనీ మీదుగా ఫ్లై ఓవర్ వరకు రోడ్లన్నీ ఆక్రమణకు గురవ్వడం, ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో పాటు రోడ్డు కిరువైపులా చిన్నచిన్న వ్యాపార కేంద్రాలు వెలవడంతో ప్రధాన రహదారి కుదించుకుపోయింది. ఫ్లై ఓవర్‌కు ఆనుకుని ఉన్న రోడ్డు పక్కనే పాఠశాలలు, నివాసాలు ఉండడంతో ఈ రహదారిపై వెళ్లాలంటే విద్యార్థులు స్థానికులు భయపడుతున్నారు. అప్రోచ్‌రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకోవడంతో విఫలమవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే సమయంలో బస్సుల రాకపోకల వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. అప్రోచ్‌రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని స్థానికులు కోరారు.



ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్‌రోడ్డు